# దొంగలొస్తున్నారు! స్వాగతం చెప్పండి!




**అ**బ్బో! అబ్బో! తెలుగుజాతి చరిత్ర ఎంత గొప్పదో? తెలుగునాడులోనే రత్నాలు వీధుల్లో కుప్పలుగా పోసి అమ్మారుట! ప్రజలంతా ఎలాంటి కంప్లెయింట్సూ లేకుండా సకల సౌభాగ్యాలతో తులతూగారట!

మరిప్పుడో! "ఆంధ్రప్రదేశ్" అ హ్హా హ్హా హ్హా – టు ది పవర్ ఆఫ్ ఇన్ఫినిటీ!

* * *

నిర్భయ్‌నగర్ కాలనీ చాలా హడావిడిగా ఉంది. కాలనీ వాళ్ళందరూ కాలనీ మధ్య పార్కులో చేరారు.

"సోదరులారా!" అన్నాడు గోపాల్రావ్ – అని చుట్టూ చూశాడు. ఆడామగా పిల్లా పీచూ అతనేం చెప్తాడా అని ఎదురు చూడసాగారు. గోపాల్రావ్ జర్నలిస్టు. అంచేత ఎప్పుడూ ఒకరు చెప్పింది రాసుకోడమే గాని మాట్లాడడం తెలీదు. అందుకని ఆ తరువాతేం మాట్లాడాలో తెలీలేదు. రెండు క్షణాలాగి మళ్ళీ "పెద్దలారా" అన్నాడు. మరుక్షణం ఆగి "పిల్లలారా!" అన్నాడు.

"పోనీలే – మామూలుగా మాట్లాడు" అన్నారెవరో. ఆ మాటతో గోపాల్రావు ఉత్సాహం పుంజుకున్నాడు.

"మన కాలనీ కూడా ఊరికి చివరగా వుంది కాబట్టి ఏ క్షణాన్నయినా దొంగలు "క్యూ" కట్టి దోచుకోవచ్చని అనుమానంగా ఉంది. ఎందుకంటే మాన్యూస్ పేపర్ల వార్తలను బట్టి దొంగలు ఇప్పటికే హైదరాబాదులోని ఊరి బయట కాలనీలన్నీ పూర్తి చేశారు. వాళ్ళ లిస్టులో మన కాలనీ ఒక్కటే మిగిలిపోయింది. కనుక మనం ముందే చోరనిరోధక చర్యలు తీసుకుంటే బావుంటుందని ఇవాళ ఇక్కడ కలుసుకున్నాం! కనుక ఏ చర్యలు తీసుకోవాలో ఎవరికితోచింది వారు చెప్పితే బాగుంటుంది" అంటూ ముగించాడు.

శాయిరామ్‌లేచి నిలబడ్డాడు.

"సోదరులారా! మన కాలనీని మనం రక్షించుకోవాలి. 'యూనిటీ ఈజ్‌స్ట్రెంగ్త్' అన్నారెవరో. ఎందుకన్నారామాట? ఇదిగో – ఇందుకే – ఈ దొంగలబాధ పడలేకే అన్నారని నేను గట్టిగా నమ్ముతున్నాను. కనుక అందరూ తమ తమ సలహాలను అందజేయవలసిందిగా కోరుతున్నాను – అని అందరివంకా సలహాల కోసం చూశాడతను.

జనం మధ్యలోనుంచి వెంకట్రావ్ లేచి నిలబడ్డాడు.

"ఈ సమస్యకు బెస్ట్ సొల్యూషన్ ఏమిటంటే మనందరం రాత్రుళ్ళు కాలనీకి కాపలా కాయటం" అన్నాడు సీరియస్‌గా.

"మనమందరమూనా!" ఎవరో అడిగారు.

"మనందరం అంటే నా వుద్దేశ్యం రోజుకి కొంతమంది చొప్పున కాలనీకి కాపలా కాయాలన్నమాట."

అందరూ "అవునూ" అంటూ అరిచారు.

"ఇదే చాలా పర్‌ఫెక్ట్‌సిస్టమ్" అన్నాడు రంగారెడ్డి.

ఓ మూలనుంచి శంకర్రావు లేచి నిలబడ్డాడు.

అందరూ చిరాగ్గా అతనివేపు చూశారు. ప్రతి విషయానికీ ఏదో ఒక అడ్డుచెప్పటం అతనికలవాటని అందరికీ తెలుసు.

"కానీ ఆ రామగిరికాలనీలో దొంగలు, ముందుకాపలా తిరిగేవాళ్ళని కత్తితో పొడిచి

తరువాత దోచుకున్నారుగా?" అనుమానంగా అడిగాడతను.

దాంతో అందరూ నిశ్శబ్దమయిపోయారు.

శాయిరామ్‌కేం మాట్లాడాలో తెలీలేదు. తను చెప్పిన సూచనని అతనలా ఒకమాటతో కొట్టిపారేయడం అస్సలు నచ్చలేదు.

"అదివేరే - ఇదివేరే" అన్నాడు చిరాగ్గా!

"అవును - అదివేరు-ఇదివేరు" అన్నాడు రంగారెడ్డి పుంజుకుంటూ.

"ఏది వేరు?" అడిగాడు శంకర్రావు.

"అదే-రామగిరి కాలనీలో సంగతి వేరయ్యా! అక్కడ కాపలా తిరిగింది ఇద్దరే! అందుకని దొంగలు అంతధైర్యం చేయగలిగారు. మనకాలనీలో రోజుకి నలుగురు తిరుగుతూంటారు."

"ఒకవేళ దొంగలు ఎనిమిదిమంది వస్తే?" మళ్ళీ అడిగాడు శంకర్రావ్. దాంతో అందరూ మళ్ళీ నిశ్శబ్దం అయిపోయారు. అందరికీ శంకర్రావు మీద పళ్ళుమండిపోతోంది. ఇలా ఆదిలోనే హంసపాదు పెట్టేస్తాడనే అతనిని మీటింగ్‌కి పిలువలేదు. అయినా వచ్చి అందరినీ చెరిగేస్తున్నాడు.

"దొంగలు సాధారణంగా నలుగురే వస్తారని పేపర్లో చదివాను" అన్నాడు శాయిరామ్ ఓ క్షణం ఆలోచించి" అంతకంటే ఎక్కువమంది ఉంటే వాళ్ళకే వర్కవుట్ అవదు."

"అవును" అన్నాడు రంగారెడ్డి.

"కనుక సోదరులారా- మనం అమలు చేయబోతున్న మొదటి సూచన ఏమిటంటే" - అంటూ శంకర్రావుని బైపాస్ చేయబోయాడు శాయిరామ్. కానీ శంకర్రావు మళ్ళీ అడ్డుపడి పోయాడు.

"మొన్న కాంతినగర్ కాలనీలో ఎనిమిదిమంది దొంగలొచ్చేకదా నానా రభసాచేసి, పదిమందిని పొడిచి వెళ్ళింది?"

మళ్ళీ అంతానిశ్శబ్దం అయిపోయింది.

చివరకు శాయిరామే కోలుకున్నాడు.

"వస్తేరానీయవయ్యా! అంతగా ఎక్కువమంది వస్తే వాళ్ళకు అడ్డుతొలిగిపోతేసరి! గొడవుండదుగా!"

"అయితే మరింక రాత్రుళ్ళు అలా నిద్రలు పాడుచేసుకుని తిరగటం ఎందుకు?"

రంగారెడ్డి తల రెండుచేతులతో పట్టుకున్నాడు.

"ఎందుకేమిటి? దొంగలు నలుగురు కంటె తక్కువ వచ్చినప్పుడు ఉపయోగం కాదూ?" అన్నాడు గోపాల్రావ్.

"అవునవును–సో! అది సెటిలయిపోయింది. ఇక రెండో సలహా ఎవరయినా ఇవ్వగలరా?"

జనంలో నుంచి డిటెక్టివ్ నవలా రచయిత్రి రాజేశ్వరి లేచి నిలబడింది.

అంతా నిశ్శబ్దం అయిపోయింది.

"మనం ఓ కొత్తపద్ధతి అవలంబిస్తే బాగుంటుంది" అందామె.

"ఏమిటది?"

"ప్రతి పది ఇళ్ళకూ కలిపి మనం కంబైన్డ్‌గా ఒక వార్నింగ్ బెల్ ఏర్పాటు చేసుకోవాలి. దాని మీట బెడ్‌రూమ్స్‌లో మంచం పక్కనే ఉంటుందన్నమాట. ఏ ఇంట్లో దొంగలుపడ్డా వాళ్లు ఆ మీట నొక్కితే మిగతా తొమ్మిది ఇళ్ళల్లోనూ బెల్ మోగుతుందన్నమాట! దాంతో అందరూ కలిసివచ్చి ఆ దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించవచ్చు ఎలా వుంది?" అడిగిందామె.

"వండర్ ఫుల్" అంటూ చప్పట్లు కొట్టారందరూ.

"ఈ వార్నింగ్ బెల్ సిస్టం వెంటనే అమలు చేయాలి" అంటూ అరిచారెవరో.

శంకర్రావ్ మళ్ళీ లేచి నిలబడేసరికి మళ్ళీ అంతా నిశ్శబ్దం అయిపోయారు.

"మళ్ళీ ఏమిటి? ఈ సిస్టంలో కూడా నీకు లోపం కనిపించిందా?" అడిగాడు రంగారెడ్డి చిరాకుగా.

"అవునూ! వార్నింగ్ బెల్ మోగుతుంది, రైటే! ఒప్పుకున్నాం ! కానీ పదిళ్ళలో ఆ బెల్ ఎవరిచ్చారో – అంటే ఏ ఇంట్లోనుంచి వచ్చిందో ఎలా తెలుస్తుంది?"

శాయీరామ్‌కి శంకర్రావు మీద వళ్ళు మండిపోతోంది.

"ఎందుకు తెలీదూ? బాగానే తెలుస్తుంది" అన్నాడు కోపం అణచుకుంటూ.

"అదే – ఎలా తెలుస్తుందీ అనడుగుతున్నాను."

రాజేశ్వరికి శంకర్రావు మీద కోపం ముంచుకొచ్చింది. తను తన డిటెక్టివ్ మెదడు నుపయోగించి, ఎన్నో రోజులు ఆలోచించి కనుక్కున్న అద్భుతమయిన ఉపాయాన్ని అతగాడలా ఎలాంటి శ్రమ లేకుండా – తీసిపారేయడం భరించలేకపోయింది.

"ఎలా తెలుస్తుందేమిటి? అలా బెల్ వచ్చిన వాళ్ళందరూ కలుసుకుంటే ఏ ఇంటి మెంబరు రాలేదో తెలిసిపోదూ?" అంది అతనో వట్టి తెలివి తక్కువ వెధవాయి అన్నట్లు చూసి.

"అలా నడిరాత్రి అందరి అటెండెన్సు తీసుకుని, అబ్సెంటెవరో చూసి తేల్చుకొనేలోగా ఆ దొంగల పనికాస్తా పూర్తయిపోతుంది కదా? అదీగాకుండా ఒకవేళ వాళ్ళు మెయిన్‌స్విచ్ ఆఫ్ చేశారనుకోండి."

"ఇక చాలు - ఆపు" అరిచాడు శాయీరామ్.

శంకర్రావు ఆ పేసి మళ్ళీ కూర్చున్నాడు.

"శ్రీమతి రాజేశ్వరిగారు చెప్పినట్లు పదిళ్ళకు కలిపి ఓ కాలింగ్‌బెల్ ఏర్పాటు చేసే పద్ధతి ప్రవేశ పెట్టాలని నిర్ణయించడమైనది" అన్నాడు శాయీరామ్.

"సోదర సోదరీమణులు ఇంకేమయినా సలహాలు ఇవ్వగలిగితే త్వరగా చెప్పండి" అడిగాడు రంగారెడ్డి.

"కాలనీవాళ్ళ డబ్బు బ్యాంక్‌లోనూ, నగలన్నీ బ్యాంక్ లాకర్లలోనూ పెట్టటం మంచిదని ఇందుమూలముగా నేను మనవి చేస్తున్నాను" అన్నాడు కొత్తగా కాలనీ బాంక్ బ్రాంచికి మేనేజరుగా వచ్చిన మార్తాండరావు. "అలా అయితే దొంగలకు దొంగిలించేందుకు ఏమీ ఉండదు.

అందరూ ఉత్సాహంగా "అవును! ఒండర్‌ఫుల్ ఐడియా" అంటూ అరిచారు.

శంకర్రావు మళ్ళీ లేచ్చి నిలబడ్డాడు.

మార్తాండరావు చిరునవ్వుతో అతని వేపు చూచాడు. తను చెప్పిన దాంట్లో లోపాలు ఎన్నటం ఎవరివల్లవుతుంది?

"అయ్యా ! నాదో సందేహం!" అన్నాడు వినయంగా.

" ఆ విషయం వేరే చెప్పక్కర లేదులే" అన్నాడు గోపాల్రావు తాపీగా.

"ఏమిటో అఘోరించు!" లోపల అనుకోబోయి పైకి అనేసి నాలిక్కరుచుకున్నాడు రంగారెడ్డి.

"మార్తండరావుగారి సలహా నాకేం నచ్చలేదు. నగలు చేయించేది ఎందుకు? అన్నీ లాకర్లలో పెట్టి దాచుకోవడానికా! సరే- చెవుల దుద్దులు, గాజులు, నెక్లెస్ తీసి బాంక్ లాకర్లలో పెడతాం! మరి ముక్కుపుడక, మంగళసూత్రం మాటేమిటి? అవి కూడా లాకర్లో పెట్టాలా?"

శంకర్రావ్ పాయింట్ ఆడాళ్ళను బాగా ఆకర్షించినట్లు కనిపించింది.

"అవునూ మంగళసూత్రం లాకర్లో ఎమిటి - నా తలకాయ" ఎవరో అనడం స్పష్టంగా వినిపించింది శాయీరామ్‌కి.

"ఇక డబ్బా అంతే! కనీసం అయిదారువేలయినా ఇంట్లో ఉంచుకోకుండా అంతా బాంకులో పడేస్తే సడెన్‌గా ఎవరికయినా ప్రాణం మీదకొస్తే ఏం చేయాలి? ఎవడిస్తాడు డబ్బు?" అనడిగాడు శంకర్రావు.

"అవును మొన్న సీతారామయ్యగారి ఆఖరి పిల్లకి ఇలాగే ప్రాణం మీదకొస్తే పాపం ఆయన చేతిలో వెయ్యిరూపాయలు లేకపాయె" పార్వతీదేవి వత్తాసుపలికిందతనికి.

మార్తాండరావు మొఖం చిన్నబోయింది. తన సలహాలోని రెండు అంశాల్నీ కూడా శంకర్రావ్ అలా చీల్చిచెండాడడం అతనికి నచ్చలేదు. అందుకని ఎదురుతిరిగాడు.

"దాన్దేముందీ? డబ్బు ఎప్పుడు కావాలంటే అప్పుడు విత్‌డ్రా చేసుకోవచ్చుగా! బాంకు ఎలాగూ కాలనీలోనే వుంది - ఉదయం సాయంత్రం ఓపెన్ ఉంటుంది."

కాని శంకర్రావ్ ఏమాత్రం బెదరలేదు.

"మరి అర్ధరాత్రి సంగతేమిటి? అప్పుడు డబ్బు కావాలంటే ఎలా? సరే అదలా వదిలేయండి. మనదేశంలో సంవత్సరానికి మూడు నెలలు మొత్తం ఆపీసులకూ బాంకులకూ శెలవులుంటాయ్. మరి ఆ మూడు నెలలూ డబ్బు దాచుకున్నవాడేం చేయాలి. అడుక్కు తినాలా? మొన్నటికి మొన్న వరుసగా మూడు రోజులు బాంకు మూసేశారు. అప్పుడు నేను మన కాలనీ వాళ్ళందరినీ అడుక్కుని భోజనం చేశాను తెలుసా?"

"అవును! బాంక్ వద్దూ, గుడ్డూ వద్దు" అన్నారొకరు. దాంతో శంకర్రావ్ విజృంభించాడు.

"ఇంకో విషయం కూడా చెప్తున్నాను మన నగలకు బ్యాంకుల్లో మాత్రం ఏమి రక్షణ ఉంది? ఆ మధ్య మా ఆవిడ గొలుసు బాంకులో తాకట్టుపెట్టి, తరువాత విడిపించుకుంటే. ఆ గొలుసులో చిన్నముక్కకొట్టేసి అతుకు పెట్టారెవరో! గాజులకు కూడా చిన్నచిన్న ముక్కలు కోసి కనిపించాయి-"

అంతా హాహాకారాలు చెలరేగాయ్.

"అవ్! నాకూ అట్లానే జరిగింది" అన్నాడు యాదగిరి లేచినిలబడి.

మార్తాండరావ్ ముఖాననెత్తురులేదు.

"సోదరులారా! ఎక్కడో ఓ వ్యక్తి అలాంటి దురాగతానికి పాల్పడినంతమాత్రాన అన్ని బాంకులూ అంతేనంటారా?" అనడిగాడు దీనంగా. సావిత్రమ్మ కోపంగా లేచింది.

"బాంకులన్నీ దగా - దొంగలు- నా గొలుసువి కూడా రెండు లింకులు కొట్టేశారు" అంది మెడలోగా గొలుసుతీసి గాలిలోవూపుతూ.

చాలామంది ఆడాళ్ళు లేచి ఆమె చుట్టూమూగారు.

శాయిరామ్, రంగారెడ్డి, గోపాల్రావ్ కలిసి అందరినీ కూర్చోమని బ్రతిమాలసాగారు.

అంతా సద్దుమణిగాక చూసేసరికి మార్తాండరావ్ ఎక్కడా కనిపించలేదు.

ఆ తరువాత ఇంకెవ్వరూ సలహాలివ్వలేదు.

అంచేత అప్పటికప్పుడే కాలనీ సభ్యులందరినీ నలుగురు నలుగురు చొప్పున గ్రూపులుగా విభజించి ఎవరు ఏ రోజు నైట్ వాచ్‌మెన్ ఉద్యోగం చేయాల్సిందీ నిర్ణయించారు.

డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరికే ఆమె సూచించిన వార్నింగ్ బెల్స్‌లను అమర్చే

కార్యక్రమం అప్పజెప్పారు. ఆమె వారంరోజులు గడువు అడిగింది. దాంతో సభముగిసింది. సరిగ్గా ఆ రాత్రే రెండింటికి శాయీరామ్ ఇంట్లోకి దొంగలొచ్చారు.

వాళ్ళంతట వాళ్ళేలేపేవరకూ శాయీరామ్‌కి మెలకువరాలేదు. నలుగురూ నిక్కర్లూ చొక్కాలూ తొడుక్కుని చేతుల్లో మెరిసే కత్తులు పట్టుకుని నిలబడి ఉన్నారు. శాయీరామ్‌కి వణుకూ, దడా వచ్చేసినయ్.

"దొ... దొ... దొ... దొంగలు" అన్నాడు వణికిపోతూ.

"ష్! ఏటా ఎదవకూతలు! దొంగలు కాకపోతే దొరలొత్తారా, నీ బోడికొంపకి! నోర్మూసుకుని ఆ ఇనుపబీరువా తాళం చేతులివ్వు!" అన్నాడో లీడర్ దొంగ కత్తి చూపుతూ.

శాయీరామ్ మాట్లాడకుంటూ తగడకిందున్న తాళం చేతులు వాళ్ళకిచ్చాడు.

అవి తీసుకుని ముగ్గురూ లోపలికెళ్ళారు.

ఇదే అదననుకొని "దొంగ-దొంగ" అని తీతువులా అరిచాడు శాయీరామ్.

మరుక్షణంలో దొంగ అతని నోరుమూసి చేతిమీద ఒక్కపోటు పొడిచాడు కత్తితో!

"నోర్మూసుకోకపోయావంటే ఛాతీలో గుచ్చుతా" అన్నాడు కోపంగా.

దాంతో శాయీరామ్ నోరు మూసేశాడు.

స్టీలు అల్మరాలోని నగలూ, డబ్బూ, ఇంకా కొన్ని విలువయిన వస్తువులూ అన్నీ చక్కగా ప్యాకింగ్ చేసుకు వెళ్ళిపోయారు వాళ్ళు. శాయీరామ్ భార్య స్వల్పంగా గాయమయిన భర్త చేయిచూసి శోకాలు పెడుతూ పాత చీరచింపుకొచ్చింది.

అతను అర్జంటుగా చేతికికట్టుకట్టుకుని బయటకు పరుగెత్తి "దొంగ దొంగలు" అంటూ కేకలు వేశాడు.

నలుగురు సభ్యులున్న వాచ్‌మెన్‌పార్టీ అతని ఇంటిముందున్న మల్లెపందిరి కింద నుంచి బయటికొచ్చారు ధైర్యంగా.

"దొంగలు వెళ్ళిపోయారా?" అడిగారు వాళ్ళు.

"ఇప్పుడే - ఇటే వెళ్ళారు."

"హమ్మయ్య! ఈ ఒక్క ఇంటితో వదుల్తారో వదల్రో అని హడలిచచ్చాం" అన్నాడొకతను.

"అంటే వాళ్ళు రావడం మీరు చూశారా?" ఆశ్చర్యంగా అడిగాడు శాయీరామ్.

"చూడకపోవడం ఏమిటి? వాళ్ళే మమ్మల్ని కత్తిచూపి తీసుకొచ్చి ఈ మల్లెపందిరి కింద కూర్చోబెట్టారు."

"మరి మీరు కత్తులతో ఎదురుతిరగలేదూ?"

"వాళ్ళు తిరగనిస్తే కదా! మేము నలుగురం ఆ చివరింటివేపు వెళుతోంటే వెనుకనుంచి వచ్చి మెడమీద కత్తిపెట్టారు. 'తిరుగుతే చస్తారు - పదండి' అన్నారు. ఇంకేం చేస్తాం! మల్లె

పందిరి కిందికి వెళ్ళాం! అక్కడనుంచీ కదలొద్దన్నారు – వాళ్ళు మర్యాదగా చెప్పాక బావుండదని కదల్లేదు."

శాయిరామ్‌కి వళ్ళు మండిపోయింది.

అప్పటికే కాలనీవాళ్ళంతా ఒక్కొక్కరే గుమికూడి పోయారక్కడ.

"నేను చెప్పలేదూ? వాళ్ళు నలుగురున్నా – మనం పదిమందున్నా ఒక్కటే !" అన్నాడు. శంకర్రావు.

"అవును – మనకేమో పెళ్ళాం బిడ్డలుండిరి. వాడేమో ప్రాణాలకు తెగించినవాడాయె" అన్నాడు వెంకట్రావ్.

అందరూ శాయిరామ్ పోగొట్టుకున్న ఆస్థిలెక్కలు వేశారు. మొత్తం పదకొండువేల ఆస్థి గోవిందా!

"పదండి! పోలీసులకు రిపోర్టిద్దాం!" అన్నాడు గోపాలరావు ఆవేశంగా.

"పోలీస్ స్టేషన్‌కి ఎందుకురు ముందు పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేయండి" ఎవరో అరిచారు.

"అవును! ఆ దొంగలు ఎంతో దూరం వెళ్ళివుండరు. ఈ రోడ్డువెంట ఇప్పుడే వెళ్తున్నారని చెప్తే – కంట్రోల్ రూమ్‌వాళ్ళు వైర్‌లెస్‌లో అందరూ మాట్లాడుకుని ఆ దొంగల్ని ఇట్టే పట్టేస్తారు."

"అయితే పదండి! మార్తాండరావుగారింట్లో ఫోన్ ఉంది."

అందరూ మార్తాండరావు ఇంటిదగ్గరకెళ్ళారు. "గోపాల్రావుని మాట్లాడమనండి! జర్నలిస్టు అంటే భయపడతారు పోలీసులు" అన్నారొకరు.

గోపాల్రావు కంట్రోల్‌రూమ్ నెంబర్ డయల్ చేశాడు గర్వంగా.

'ఎంగేజ్‌డ్' అన్నాడు. వెంటనే మరోక్షణం ఆగి మళ్ళీ రింగ్ చేశాడు. మళ్ళీ 'ఎంగేజ్‌డ్' అన్నాడు. అక్కడున్న వాళ్ళందరికీ ఆశ్చర్యం కలిగింది.

"కంట్రోల్‌రూమ్ ఫోన్ ఎంగేజ్ ఎలా ఉంటుందయ్యా – అదీ ఇంతరాత్రప్పుడు! ఒకవేళ అది చెడిపోయి అఘోరించిందేమో! లోకల్ అసిస్టెన్స్‌కి కొట్టో రింగ్" సలహా ఇచ్చాడు. రాజేశ్వర్రావు.

లోకల్ అసిస్టెన్స్ కూడా ఎంగేజే వినిపించింది.

"భలే తమాషాగా వుందే! అర్ధరాత్రి కూడా ఇంత డిమాండ్ ఉంటుందా కంట్రోల్‌రూమ్‌కీ, లోకల్ అసిస్టెన్స్‌కీనూ" ఆశ్చర్యంగా అన్నాడు కుటుంబరావు.

గోపాల్రావు మళ్ళీ కంట్రోల్‌రూమ్‌కి రింగ్ చేశాడు – ఊహు! ఇంకా ఎంగేజ్ చూపిస్తూనే ఉందది. పావుగంట గడచిపోయింది. అనుకోకుండా లోకల్ అసిస్టెన్స్ నెంబరు రింగయింది.

"హలో అసిస్టెన్స్" అంది ఆపరేటరు.

"పోలీసు కంట్రోల్‌రూమ్ ఎంగేజ్ చూపిస్తోందండి. ఇరవై నిమిషాల నుంచీ! అర్జంటుగా అక్కడికి కనెక్షన్ ఇవ్వండి - దొంగలు పారిపోతున్నారు."

ఆమె క్షణం తర్వాత మాట్లాడింది.

"సారీ! ఇటీజ్ ఎంగేజ్‌డ్ - "

"ఎంగేజ్ డా! ?"

"అవును."

"ఇందాకట్నుంచీ ఎంగేజ్‌డేనా?"

"అవునండి!"

"ఇంత రాత్రప్పుడు ఎంగేజ్ ఏమిటండీ నా మొఖం! "స్టయిల్‌గా అన్నాడు గోపాలరావు.

"మీ మొఖం సంగతి నాకు తెలీదుగానండి! ఆ ఫోన్ మాత్రం ఎంగేజ్ ఉంది!".

గోపాల్‌రావు కంగారుగా చుట్టూ చూశాడు, పొరపాటున ఆ మాట యెవరయినా విన్నారోమోనని.

"ఇదిగో చూడండి! నేను న్యూస్‌పేపర్ జర్నలిస్టుని. ఈ టైమ్‌లో కంట్రోల్‌రూమ్ ఎంగేజ్ యెలా వుంటుంది? మరోసారి ట్రై చేయండి."

"కంట్రోల్‌రూమ్ ఎప్పుడు బిజీగా ఉండేదీ తెలీని జర్నలిస్టులు కూడా ఉన్నారంటే ఆశ్చర్యంగా ఉంది"అందామె.

"అంటే రాత్రి రెండు గంటల సమయంలో అదెప్పుడూ ఎంగేజ్ ఉంటుందన్నమాట!"

"అవును స్వామీ అవును!" అనేసి ఫోన్ పెట్టేసిందామె.

"రాత్రంతా ఆ ఫోన్ అలా ఎంగేజ్ ఉండటమేమిటి?" ఆశ్చర్యంగా కుటుంబరావు నడిగాడు గోపాల్రావు.

"అవునయ్యా! ఎడతెరిపి లేకుండా దొంగతనాలు జరగబట్టే- ఇలా ఫోన్‌ల కెగబడుతున్నారు జనం" ఎవరో అన్నాడు.

"ఒక్క దొంగతనాలేమిటి! మనం ఉన్నది ఆంధ్రప్రదేశ్ రాజధానిలో కదా! దోపిడీలు, మర్డర్‌లు, కార్లలో తిరిగి ఒంటరిగా కనిపించిన ఆడవారిని ఎత్తుకుపోయి మానభంగాలు చేయడం, రౌడీలు వీరవిహారాలు చేయడం - ఇవన్నీ రాత్రుళ్ళే ఎక్కువగా జరుగుతాయి కదా! అందుకే కంట్రోల్ రూమ్ తెగ బిజీగా ఉంటుంది."

మరోసారి కంట్రోల్‌రూమ్‌కి రింగ్ చేశాడు గోపాల్రావు. అతని మొఖం వెలిగిపోయింది. హఠాత్తుగా చెయ్యి పైకెత్తి "సైలెన్స్! నిశ్శబ్దంగా ఉండండి! దొరికింది" అంటూ వెర్రికేక వేశాడు.

"హలో !" అన్నాడు అవతలి వ్యక్తి.

"హలో ! నేను జర్నలిస్టు గోపాల్రావుని మాట్లాడుతున్నారండీ! నిర్భయ్ నగర్ కాలనీ నుంచి మాట్లాడుతున్నానన్నమాటండీ! సంగతేమిటంటే శాయీరామ్ ఇంట్లో దొంగలు పడ్డారండీ. ఇప్పుడే సూట్‌కేసులతో సహా నాగార్జునసాగర్ రోడ్డు వేపు వెళ్ళారండీ. వాళ్ళు మొత్తం నలుగురు - నలుగురు చేతుల్లో నాలుగు కత్తులు - ఇవే వాళ్ళ ఆనవాళ్ళు. సొమ్ములన్నీ తీసుకొని వాళ్ళ సూట్‌కేసులలో పెట్టుకొని పోయారండీ - చాలాండీ ఇంకేమయినా వివరాలు కావాలా?" గుక్కతిప్పకుండా మాట్లాడడం చేత ఆయాసపడసాగాడు గోపాల్రావు. అందరూ అతనివేపు అభినందన పూర్వకంగా చూశారు.

"ఫుల్ డిటెయిల్స్ - బట్ క్రిస్ప్! ఎంత చక్కగా ఇచ్చాడండి వివరాలు!" మెచ్చుకోలుగా అన్నాడు రాజేశ్వర్రావ్.

"అతనెప్పుడూ అంతేనండీ! జర్నలిస్టు కదా! టు ది పాయింట్ - మాట్లాడతాడు! అంతే!" ఇంకెవరో పొగిడారు.

"హలో" అన్నాడు గోపాల్రావ్ పొంగిపోతూ మళ్ళీ.

"హలో" అంది అవతలి గొంతు.

"నేను చెప్పినవన్నీ నోట్ చేసుకున్నారా? ఏమిటి? నేనా? నేను ప్రముఖ జర్నలిస్టు గోపాల్రావ్‌ని"

"..........................."

గోపాల్రావ్ మొఖం పాలిపోయింది.

"ఆ ! ఏమిటి? మీరు మాట్లాడుతోంది కంట్రోల్‌రూమ్ నుంచి కాదా? మరెక్కడినుంచి? "మీ ఇంట్లోనూ దొంగలుపడ్డారా? గంటసేపటి నుంచీ మీరూ కంట్రోల్‌రూమ్ కోసం ప్రయత్నిస్తున్నారా? మరా సంగతి ముందే చెప్పరే. అనవసరంగా సంబరపడ్డాను - కంట్రోల్‌రూమ్ దొరికిందని" ఫోన్ పెట్టేశాడతను చిరాగ్గా.

అంతా మళ్ళీ నిరుత్సాహపడిపోయారు.

"ఇలా కంట్రోల్‌రూమ్ కోసం కూర్చుంటే పుణ్యకాలం కాస్తాపూర్తయిపోతుంది. త్వరగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్దాం పదండి" అన్నాడు వెంకట్రావ్.

"అవును పదండి!"

"అందరూ ఎందుకులెండి! ముందు నలుగురు వెళ్తే సరిపోతుంది. అందరం వెళ్ళామంటే మళ్ళీ దొంగల బాచ్‌వచ్చి అన్ని ఇళ్ళూ ఊడ్చుకుపోతారు" అన్నాడు రంగారెడ్డి.

"గోపాల్రావ్‌ని తీసుకెళ్ళండి. జర్నలిస్టు అంటే కొంచెం త్వరగా యాక్షన్ తీసుకుంటారు" అన్నారెవరో.

గోపాల్రావ్, శాయీరామ్, వెంకట్రావ్, రంగారెడ్డి కలిసి పోలీస్‌స్టేషన్‌కి బయల్దేరారు.

"ఎవరది?" అంతదూరంలో ఉండగానే అరిచాడు సెంట్రి.

"నిర్భయ్‌నగర్ కాలనీవాళ్ళం" అన్నాడు గోపాల్రావ్.

"ఏం కావాలి?"

"మా కాలనీలో దొంగతనం జరిగింది. కంప్లయింట్ ఇవ్వాలి."

"అదుగో – ఆయనతో చెప్పండి!" అన్నాడు లోపల కుర్చీలో నిద్రపోతున్నతతనిని చూపుతూ.

అందరూ లోపలికెళ్ళి అయిదు నిమిషాల పాటు తంటాలుపడి అతనిని లేపారు. తన నిద్రకలాభంగం కలిగించినందుకు అతనికి కోపం వచ్చింది.

"ఏం కావాలి?" అడిగాడు చిరాకుగా.

"దొంగతనం జరిగింది."

"ఎక్కడా?"

"శాయీరామ్ గారింట్లో"

"ఏ శాయీరామ్?"

"కె.యల్. శాయీరామ్."

"నేనడిగేది అదికాదు – ఎవడా శాయీరామ్"

"నేనే" అన్నాడు శాయీరామ్ ముందుకొచ్చి.

"ఆ! ఏం జరిగింది?"

"దొంగలు వచ్చి కర్ర చూపించి నగలూ, డబ్బూ, ఇంకా ఇతర వస్తువులు ఎత్తుకుపోయారండీ."

"ఎంతమంది ఉన్నారు వాళ్ళు?"

"నలుగురండీ"

"ఎలా వున్నారు?"

"నల్లగా – పొడుగ్గా ఉన్నారండి."

"వాళ్ళను ఇంతకు ముందెక్కడయినా చూసినగుర్తుందా?"

"లేదండీ."

"నీ పేరేమిటి?"

"శాయీరామ్ అండీ."

"ఏ శాయీరామ్?"

"కె.యల్. శాయీరామ్–"

"మీ అయ్య పేరేంది?"

"మా ఫాదర్ పేరా?"

"అవును."

"ఆయన పేరెందుకు?"

"కావాల్నయ్యా."

"శంభులింగం."

"ఏ శంభులింగం?"

"కె.యల్. శంభులింగం"

"నీ తాత పేరు?"

"నా తాత పేరు కూడా కావాలా?"

"కావాల్నయ్యా."

"బసవరాజు."

"ఏ బసవరాజు."

"కె.యల్. బసవరాజు."

"దొంగతనం ఎన్ని గంటలకు జరిగింది?"

"రెండు గంటకు".

"తలుపులు తెరిచి ఉంచావా నువ్వు."

"నేనెందుకు తెరుస్తాను"

"మరెలా వచ్చిర్రువాళ్ళు?"

"తలుపులు పగల గొట్టుకొని వచ్చారు."

"అంతవరకూ నువ్వెందుకు లొల్లిపెట్టలేదు?"

"పెట్టేంత టైముంటే ఈ గొడవంతా ఎందుకొస్తుంది?"

"ఆళ్ళనింకెవరయినా చూసినోళ్ళున్నారా?"

"నైట్ వాలంటీర్ పార్టీవాళ్ళుచూశారు–"

"ఎవరాళ్ళు?"

"శ్రీధరం, రత్నాకరం, కిషోర్, రాజేష్"

"వాళ్ళంతా నమ్మదగినవాళ్ళేనా?"

శాయిరామ్ ఉలిక్కిపడ్డాడు. "అదేంటండీ? వాళ్ళు మా కాలనీ వాళ్ళేగా?"

"కాలనీ ఏమిటయ్యా! ఇంట్లో సొంతమనుషులే మర్డర్లు చేస్తుర్రు – ఇయ్యాల్రేపు."

"అబ్బే! వాళ్ళంతా నమ్మకస్తులే!"

"మీదే కాలనీ?"

"నిర్భయ్‌నగర్ కాలనీ!"

"నిర్భయ్‌నగర్ కాలనీయా?" ఇంకా చిరాకుగా అన్నాడతను.

"అవును."

"మరి ఇక్కడికెందుకొచ్చారు?"

"ఇంకెక్కడికెళ్ళాలి! రిపోర్టివ్వాల్సింది పోలీస్ స్టేషన్‌లోనేగా?"

"పోలీస్ స్టేషన్‌లో కాకపోతే మంగలిషాపులో ఇస్తారేమిటి? నేననేది అదికాదయ్యా! ఇది మీ ఏరియా పోలీస్ స్టేషన్ కాదు."

"మరి మా ఏరియా పోలీస్ స్టేషనెక్కడుంది?"

"ఆ రోడ్డు చివర ఉంది."

"అంతదూరం వెళ్ళాలా ఇప్పుడు?"

"రిపోర్టివ్వాలంటే–"

అనేసి మళ్ళీ నిద్రకోసం వెనక్కువాలాడతను.

"ఇంకిప్పుడెందుకులే రిపోర్టివ్వటం! పొద్దున్నవెళదాం!" అన్నాడు రాజేశ్వర్రావ్.

"అవును. ఎలాగూ దొంగలీ పాటికి మరో రెండు మూడు ఇళ్ళు కూడా చూచుకుని వాళ్ళిల్లు చేరుకుని ఉంటారు" అన్నాడు రంగారెడ్డి.

నలుగురూ మళ్ళీ కాలనీకి చేరుకున్నారు. అప్పటికే కాలనీ అంతా నిశ్శబ్దం అయిపోయింది. అందరూ నిద్రపోయినట్లున్నారు. వాళ్ళను చూడగానే కుక్కలు హఠాత్తుగా నాలుగువేపుల నుంచి వచ్చి మొరగసాగాయి. కుక్క అరుపులు వినగానే వాలంటీర్ పార్టీ వాళ్ళు కర్రలు తీసుకుని పెద్దగా కేకలు వేసుకుంటూ పరుగుతో వచ్చారు. మరుక్షణంలో అందరిళ్ళల్లోనూ లైట్లు వెలిగిపోయినయ్. క్షణాల్లో కాలనీ వాళ్ళందరూ వాళ్ళచుట్టూ మూగిపోయారు.

"ఇందాకవచ్చిన దొంగలేనా?" అన్నాడు మార్తండరావ్. వాళ్ళ మొఖాల మీద టార్చ్‌లైటు వేస్తూ.

శాయీరామ్‌కి వళ్ళు మండిపోయింది.

"సిగ్గులేకపోతేసరి! నిజంగా దొంగలొచ్చి దోచుకుపోయినపుడు ఒక్కడూ దిక్కులేడు గానీ ఇప్పుడు భూమి ఈనినట్లువచ్చేశారు" అన్నాడు చిరాకుగా.

"అవును, కుక్కలూ అంతేగా" తాపీగా అన్నాడు రంగారెడ్డి.

"మీ రిద్దరూ స్కూటర్ మీద వెళ్ళి మన ఏరియా పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టిచ్చిరండి. నేనూ, రంగారెడ్డి వెళ్ళి మా పేపర్లో ఈ వార్త ఎక్కించేసి వస్తాం"అన్నాడు గోపాల్రావ్.

"ఏమని రాస్తావు న్యూస్?" ఎవరో అడిగాతనిని సంబరంగా.

నిర్భయ్‌నగర్‌లో భయంకరమైడెకాయిటీ! ఇంటి యజమాని శాయిరామ్‌తో ఢీ! పదకొండువేల ఆస్థి ఠా! చేతికి కత్తిపోట్లు – పోలీసువారి నిర్లక్ష్యం. ఇదంతా మెయిన్ హెడ్డింగ్ అన్నమాట. కింద నాలుగు పేరాలు వివరాలు రాస్తాను."

"అబ్బ ఒండర్‌ఫుల్ –" అన్నాడు రాజేశ్వర్రావ్. మర్నాడు ఉదయం ఆరుగంటలకల్లా న్యూస్‌పేపర్‌కొని కాలనీ వాళ్ళంతా తమ కాలనీ దొంగతనం వార్త ఉత్సాహంగా చదువుకోసాగారు. మరికాసేపట్లో పోలీస్‌వానూ, జీపూ వచ్చేసినయ్ అక్కడకు.

అందులోనుంచి బిలబిలమంటూ పోలీసులు, పోలీసుకుక్కలు, పోలీస్ అధికారులు, ఓ ఫోటోగ్రాఫరూ దిగి శాయిరామ్ ఇంట్లోకి వెళ్ళారు కాలనీవాళ్ళంతా శాయిరామ్ ఇంటిముందు మూగిపోయి ఉత్సాహంగా చోద్యం చూడసాగారు. కుక్కలు దొంగల వాసన గుర్తెట్టుకుని వాళ్ళను పట్టుకోడానికి బయటికొచ్చాయ్. అందరూ వాటి వెనకే బయల్దేరారు. అవి కాలనీ చుట్టూ రెండు రౌండ్లు తిరిగి గోపాల్రావ్ ఇంట్లోదూరి మొరగసాగాయ్!

"అదేమిటి? అతన్ని చూసి మొరుగుతాయ్?" అడిగారు జనం.

"మీరెవరు?" అన్నాడు పోలీస్ అధికారి గోపాల్రావ్‌ని చూసి.

"జర్నలిస్టు గోపాల్రావ్ ఇతనేనండీ! ఈ దొంగతనం గురించి ఇవాళ పేపర్లో రాసింది ఇతనే" పరిచయం చేశాడు శాయిరామ్.

"ఓహో" అనుమానంగా తలపంకించాడతను.

"అయితే పోలీస్‌స్టేషనుకి పదండి."

గోపాల్రావ్ అదిరిపడ్డాడు. "పోలీస్ స్టేషనుకా? ఎందుకు?"

"మిమ్మల్ని ప్రశ్నించాల్సివుంది."

ఈలోగా కుక్కలు మళ్ళీ జుయ్‌మంటూ పరుగెత్తి వెంకట్రావ్ ఇంట్లో దూరాయ్. అది చూసి వెంకట్రావ్‌కి చలిజ్వరం వచ్చేసింది. "ఇదేం అన్యాయం సార్! చిన్నప్పటి నుంచీ పూచిక పుల్ల కూడా ముట్టుకుని ఎరగను." అన్నాడు ఏడుపు మొఖంతో.

కుక్కలు అక్కడనుంచి గుంపులో నిలబడ్డ యాదగిరిని చూసి మొరగటం ప్రారంభించేసిరికి పోలీస్ అధికారికి చిరాకేసుకొచ్చింది.

"అంటే మేమందరం దొంగలమేనంటారా?" అడిగాడు యాదగిరి.

అందరూ ఘొల్లున నవ్వారు.

"ఇంక వీటిని తీసుకుపోండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కుక్కలు మళ్ళీ వాన్ ఎక్కి వెళ్ళిపోయాయి.

కాలనీ వాళ్ళంతా పోలీస్ అధికార్ల చుట్టూ మూగారు.

"ఇలా విచ్చలవిడిగా దొంగతనాలు జరుగుతూంటే మీరేం చేస్తున్నట్లు? "అందరి తరుపునా వకాల్తాపుచ్చుకున్నట్లు అడిగాడు గోపాల్రావ్.

పోలీస్ అధికారికి వళ్ళు మండిపోయింది.

"నువ్వెవరివి?"

"జర్నలిస్టుని?"

"ఓహో– అయితే పోలీసు డిపార్ట్‌మెంట్ ఏం చేస్తుందో అదివరకు మీ పేపర్లు రాయలేదా?"

"రాశాం!"

"రాస్తే మళ్ళీ అడుగుతారేం?"

"డెకాయిటీలు ఎక్కువయిపోయాయి కాబట్టి!"

"డెకాయిటీలు ఎక్కువవ్వలేదు" కోపంగా అన్నాడు పోలీసు అధికారి.

"అబద్దం" అరిచాడు గోపాల్రావ్

"అవును అబద్దం" అన్నారు, అందరూ వత్తాసుగా.

"అబద్దం ఏమీలేదు."

"అయితే మరి డెకాయిటీలు రోజుకోటి జరుగుతోంటే లేదంటారేమిటి?"

పోలీసు అధికారి తల రెండు చేతుల్లో పట్టుకున్నాడు.

"అబ్బా! అవి దొంగతనాలు! అంటే వాటిని 'రాబరీ' అంటారు! డెకాయిటీలు వేరు."

"రెండూ ఒక్కటేగా? ఏరాయి అయినా మా పళ్ళేగావూడేది?" ఎవరో అరిచారు.

"కాదయ్యాబాబు! రెండూ వేరు" విసుక్కున్నాడతను.

"ఏమిటో ఆ తేడా?"

"నలుగురుగానీ – ఇంకా తక్కువగానీ దొంగలు వస్తే అదిరాబరీ. అయిదుగురుగానీ, ఇంకా ఎక్కువగానీ వస్తే అది డెకాయిటీ–"

"అయితే ఇప్పుడు శాయీరామ్ గారింట్లో జరిగింది డెకాయిటీకాదంటారు?"

"మేము దాన్ని 'రాబరీ' కేటగిరిలో వేసుకుంటాం!"

"మీరు దేనికిందేసుకుంటే మాకెందుకండీ ఇప్పుడీ దోపిడీ...."

"ఇది దోపిడీ కాదన్నానా, దొంగతనం అను! ఆ!"

"అబ్బా ఏదొకటిలెండి సార్!"

"అలా వీల్లేదు. దేనికదే. మీ యిష్టం వచ్చినట్లు మీరు పేర్లు పెడితే ఎలా? ప్రతి దానికీ – ఓ పేరూ, ఓ మెయిన్ హెడ్డు, ఓ ప్రొసీజరూ ఉంటాయ్."

"అయితే యిప్పుడేమంటారు?"

"ఇది రాబరీకిందవస్తుంది, డెకాయిటీ అనటానికి వీల్లేదు."

"సరే, అనం! అయితే యిప్పుడు రాబరీ కిందవచ్చింది కాబట్టి మనకేమయినా లాభం వుందా"

"ఎందుకులేదు? అన్నీ ఒకటిగా లెక్కవేసి – ఆ సంఖ్య చూస్తే గుండెపగిలిపోదూ అందరికీ? అందుకేయిలా విభజించేస్తే చాలా తక్కువగ కనబడతాయ్. చూశారా మా డిపార్ట్‌మెంట్‌కి ఎంతలాభమో–" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"పోనీయింకోపని చేయకూడదా సార్!"

"ఏమిటది?"

"సరదా దొంగతనాలు, అవసరం కొద్దీ దొంగతనాలు, ఆకలి దొంగతనాలు, అలవాటు చొప్పున చేసిన దొంగతనాలు, మానసిక బలహీనతవల్ల చేసే దొంగతనాలు– యిలా బోలెడు భాగాలుగా విభజిస్తే అస్సలు తగ్గిపోతాయిగా! యించుమించుగా ఏమీలేనట్టే స్టేట్‌మెంట్లివ్వచ్చు."

ఆయన అర్జంటుగా జీపెక్కివెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం మళ్ళీ కాలనీ మీటింగ్ జరిగింది.

"నేను ఆరోజే చెప్పాను. పది ఇళ్ళకు కలిపి ఓ వార్నింగ్‌బెల్ ఏర్పాటు చేయమని. కానీ ఎవరూ వినిపించుకోలేదు. ఇప్పటికయినా దాని విలువ గుర్తించి యేర్పాటు చేశారంటే ఆ దొంగల్ని మనమే పట్టుకోవచ్చు" అంది డిటెక్టివ్ రచయిత్రి ఆవేశంగా. అప్పటికప్పుడే చందాలు పోగుచేశారు. నలుగురు ఎలక్ట్రీషన్లు ఆరాత్రంతా పనిచేసి మర్నాటికి వార్నింగ్‌బెల్స్ ఏర్పాటుజేసేశారు. చాలాసార్లు వాటిని ప్రయోగాత్మకంగా మోగించి సంతృప్తిచెందారు.

స్వయంగా రాజేశ్వరే రాత్రిళ్ళు రాబరీ డ్రిల్స్ నిర్వహించింది. అంటే రాత్రి రెండింటింకి ఏదోక ఇంట్లో నుంచి వార్నింగ్‌బెల్ వస్తుందన్నమాట. దాంతో అందరూ బయటకు పరుగెత్తుకురావాలి. ఆ డ్రిల్స్ విజయవంతంగా పూర్తయినాయి. ఆ మర్నాడే సీతాపతి ఇంట్లో దొంగలుపడ్డారు. వాడు ఎలాగోలా ధైర్యం తెచ్చుకుని వార్నింగ్‌బెల్ కొట్టాడు. కాని ఆ చుట్టుప్రక్కల వాళ్ళందరియిళ్ళూ, ముందే బయటనుంచీ గొళ్ళాలు పెట్టారు దొంగలు. బయటి నుంచీ గొళ్ళాలు తీయాల్సివచ్చింది.

మర్నాడే మళ్ళీ కాలనీ మీటింగ్ ఏర్పాటు చేశాడు శాయిరామ్.

"సోదరులారా! మనం చేయగలిగినవన్నీ చేశాం! యిప్పుడు మనకు తెలిసొచ్చిన విషయం ఏమిటంటే మన ఉపాయాలే మీ పనికిరావని! యింకా కొత్త ఉపాయాలేమైనా ఎవరయినా చూచించగలరా?" అడిగాడతను. ఎవ్వరూ మాట్లాడలేదు. చివరకు రంగారెడ్డి లేచి నిలబడ్డాడు.

"ఈ సమస్యకు ఒకే ఒక్క పరిష్కారం ఉంది." అన్నాడతను.

"ఏమిటిది?"

"దొంగలకు మనమే స్వాగతం చెప్పడం!" అందరూ నవ్వారు.

"రంగారెడ్డికి పిచ్చిపట్టింది" అనుకున్నారు కొందరు.

"అయ్యా! నాకేం పిచ్చిపట్టలేదు. ఫాక్ట్స్ చెబుతున్నాను. దొంగలకు మనందరం కలిసి స్వాగతం చెప్దాం. బాబూ మా ఇళ్ళు అలా ఇష్టం వచ్చినట్లు దోచుకోకండి. మీకు నెలనెలా మేమే ఎంతో కొంత ముట్టచెబుతాం అని రిక్వెస్టు చేద్దాం" మళ్ళీ కేకలు చెలరేగినయ్.

కాసేపు కోలాహలం తరువాత శాయిరామ్ లేచాడు.

"మన సోదరుడు రంగారెడ్డి సూచించిన ఉపాయమే బాగున్నట్లుతోస్తోంది" అన్నాడు వెంకట్రావ్.

మరి కాసేపట్లో అందరూ రంగారెడ్డి ఆలోచన బాగానే వుందనే నిర్ణయానికొచ్చారు. వెంటనే రంగారెడ్డి అధ్యక్షుడిగా దొంగల స్వాగతం కమిటి ఒకటివేశారు. శాయిరామ్, యాదగిరి, గోపాల్రావు, సీతాపతి అందులో సభ్యులు.

"ఇంతకూ దొంగలకు ఆహ్వానం పంపడం ఎలా?" అడిగాడు యాదగిరి.

"దానిదేముందీ? అన్ని న్యూస్‌పేపర్లలోనూ ఆహ్వానపత్రాలు పబ్లిష్‌చేద్దాం – వాళ్ళెలాగూ న్యూస్‌పేపర్లు చదువుతారు కాబట్టి తెలుసుకుని సంప్రదింపులకు వచ్చేస్తారు."

ఆ రోజే టాక్సీలో సిటీ అంతా తిరిగి నాలుగు భాషల్లో ఎనిమిది న్యూస్ పేపర్లలో ఆహ్వానాలు ప్రకటింపజేశారు వాళ్ళు.

"మహారాజశ్రీ దొంగలకు! నిర్భయ్‌నగర్ కాలనీవాసుల స్వాగతం! సుస్వాగతం! ఆర్యా! మా కాలనీలో మీకు వచ్చే శనివారం రాత్రి ఘనమయిన స్వాగత సభయేర్పాటు చేయబడుతుంది. కనుక మీరెల్లరు మా స్వాగతాన్ని మన్నించి, సభకు విచ్చేసి మాతో సంప్రదింపులు జరపవలసిందిగా ప్రార్థిస్తున్నాము. మీరు జరుపుతున్న దొంగతనాల వల్ల రాత్రుళ్ళు మీకు, మాకు నిద్రాభంగము కలుగుచున్నది. అంతేకాదు, తరచుగా మీ కత్తిపోట్లవల్ల మా శరీరాలకు గాయాలు – వాటిని మాన్పించుటకు డాక్టరు బిల్లులు మీ మీద రిపోర్టు ఇచ్చుటకు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం, దానికి ఆటో, టీ, ఖర్చులు, కొన్ని నగలు బాంకులాకర్లలో దాయడం మూలాన దానికయ్యే లాకర్ చార్జీలూ, సగంలో కొంత బంగారం బాంకువారు కొట్టేయడం– లేదా బాంకులోనే దొంగతనం జరగడం– ఇవన్నీ ఆలోచించి మేమీనిర్ణయానికొచ్చాము. కనుక మీరు తప్పక శనివారం రాత్రిమాచే ఏర్పాటు చేయబడిన ఆహ్వాన సభకు విచ్చేసిమాతో సంప్రదింపులు జరిపి, పరిష్కారపత్రాల మీద సంతకం చేసి,

ఆ తరువాత మేమొసంగు చందన, తాంబూలాది సత్కారములు గైకొని మమ్మానందింప జేయవలసిందిగా ప్రార్థిస్తున్నాము– ఇట్లు ఆహ్వాన సంఘం–"

శనివారం రాత్రి కాలనీ ఆవరణ అంతా పండగ వాతావరణం అలుముకుపోయింది. పెద్దషామ్యానాలు, పెద్దవేదిక, రంగురంగుల దీపాలు, మైకులు, రికార్డులతో హడావుడిగా ఉంది.

"దొంగమహాశయులకు సుస్వాగతం" అన్న బోర్డు దేదీప్యమానంగా వెలుగుతోంది. సరిగ్గా రెండింటికి అరుగురు దొంగలు కారుదిగారు.

వెంటనే రంగారెడ్డి, మిగతా కమిటీ సభ్యులు ఎదురువెళ్ళి పూలదండలు వేసి స్వాగతం పలికారు. అందరూ వేదికమీద కూర్చున్నారు. ఆ దొంగల్లోకందరికీ ఛీఫ్ దొంగను మాట్లాడవలసిందిగా కోరారు. దొంగలేచి మైక్ దగ్గరకొచ్చాడు.

"సోదర సోదరీమణులారా! మేము దొంగలమే. వప్పుకుంటున్నాం. కానీ మేము దొంగలమయింది మాకేం సరదాపుట్టికాదు. అది ఒక వృత్తిగా స్వీకరించాం! అందులో తప్పేమిటో నాకు అర్థం కావటం లేదు. రాజకీయాలు ఒక వృత్తి, అలాగే గూండాయిజం ఒక వృత్తి, అలాగే మర్డర్లుచేయడం ఒక వృత్తి. ఈ వృత్తులన్నీ కూడా మనం చేసేది కేవలం డబ్బు సంపాదనకేనని అందరికీ తెలుసు. మరి దొంగతనాలు కూడా డబ్బుసంపాదనకే కదా చేసేది! దీన్ని "ఇల్లీగల్' అని ఎందుకంటున్నారో నాకు తెలీటం లేదు. ఇప్పటికయినా మీలో చైతన్యం కలిగి దీనిని చట్టసమ్మతం చేయడానికి ప్రయత్నిస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది. మాక్కావలసిందేమీలేదు. మాకూ, మా భార్యాబిడ్డలకూ మూడుపూటలా తిండీ, ఖరీదయిన బట్టలూ, సొంతిళ్ళూ, కారు మెయింటెనెన్స్ ఖర్చులు, పెట్రోల్ ఖర్చులూ, రోజుకో విస్కీటీ బాటీలూ– ఇంతే మాక్కావలసింది. వీటి కోసమే మేము దొంగతనం చేస్తున్నాం. మిమ్ముల్ని కత్తులతో పొడుస్తున్నాం! మీరు మరి వీటన్నింటికీ సరిపోయే మామూలు నెలనెలా మాకు పడేస్తే మేము ఇంక మీ జోలికెందుకు వస్తాం. ఛస్తేరాము. జైహింద్" అంటూ స్పీచ్ ముగించాడతను.

అందరూ తప్పట్లుకొట్టారు.

మరుక్షణంలో సంప్రదింపులు ప్రారంభమయ్యాయి.

చివరకు అందరూ ఓ నిర్ణయానికొచ్చారు. ఒప్పందం మీద సంతకాలయ్యాయి.

కాలనీ రిజిష్టర్‌లో దొంగగానమోదయిన వారందరికీ నెలకు అయిదువేలు చొప్పున జీతం (కన్సాలిడేటెడ్) ఇవ్వబడుతుంది. సంవత్సరానికొకసారి దీపావళి పండుగ ముందు వేతనానికి సమానయిన బోనస్ కూడా ఇవ్వబడుతుంది. దీనికి ప్రతిఫలంగా వారు నిర్భయ్‌నగర్ కాలనీలో దొంగతనాలు చేయరు, ఇంకొకరిని చేయనీరు.

అందరూ ఆ ఎగ్రిమెంట్‌కి హర్షం వెలిబుచ్చారు. ఆ తరువాత అల్పాహార విందు జరిగింది. విందులో దొంగల నాయకునితో ఇంటర్వ్యూ ప్రారంభించాడు జర్నలిస్టు గోపాల్రావు.

"అయ్యా! తమరి స్వగ్రామం ఏది?"

దొంగల లీడర్ నవ్వాడు. "మాది తమిళనాడు. మా గ్రూపులో ఆంధ్రప్రదేశ్‌కి చెందినవారెవరూ లేరు ప్రస్తుతానికి" అన్నాడు.

"అదేమిటి మీ స్వంత స్టేట్‌లో దొంగతనాలు చేసుకోకుండా ఇలా పరాయి రాష్ట్రాల కెందుకు ఎగబడుతున్నారు?"

దొంగల నాయకుడు ఆ ప్రశ్నకు చిరాకుపడ్డాడు.

"నీళ్ళు ఎటు ప్రవహిస్తాయి?" అనడిగాడు గోపాల్రావుని.

"పల్లం వేపు"

"అవునా? మరి మేమూ అంతే! ఏ రాష్ట్రంలో పోలీసు డిపార్ట్‌మెంట్ చేతకానిది ఉంటుందో అక్కడ హాయిగా బ్రతకొచ్చుగదా మేము!"

"ఓహో అదా సంగతీ!" అసలు రహస్యం తెలిసినట్లు రాసుకున్నాడు గోపాల్రావ్.

"అంటే మీ ఉద్దేశ్యం– కేవలం పోలీస్ డిపార్ట్‌మెంట్ దేనికీ పనికిరాదు అన్న రాష్ట్రంలోనే దొంగతనాలు చేస్తారన్నమాట! అంతేనా?"

"అంతేకాదు– ఇంకోటి కూడా వుంది."

"అదేమిటి? ప్రజలు! ఇక్కడి ప్రజలు గంగిగోవుల్లాంటివారు. కత్తిచూపించగానే సర్వస్వం యిచ్చేస్తారు. ఎన్ని దొంగతనాలు చేసినా– ఎంతమందిని చావగొట్టినా కిక్కురుమనకుండా పడివుంటారు. ప్రజలను రక్షించటం చేతకాని ప్రభుత్వాన్ని తీసిపారేయాలని కోరుకోరు! కనుక మేము హాయిగా రిటైరయ్యేవరకూ సుఖప్రదమయిన జీవితం గడపొచ్చు. ఈ రాష్ట్రానికి స్వర్ణాంధ్రప్రదేశ్ అని అందుకే మేము పేరుపెట్టాం!"

"సరే– ఇప్పుడు మీరు ఇంతధైర్యంగా వచ్చారు కదా ఇక్కడికి! ఒకవేళ పోలీసులు వచ్చి పట్టుకుంటే ఏంచేసేవారు?"

ఆ దొంగల నాయకుడు పకపకానవ్వాడు.

"ఏమిటి నవ్వుతారు?"

"ఇంత చిన్న విషయం తెలీదంటే ఆశ్చర్యంగా వుంది."

"ఏమిటా చిన్న విషయం?"

"పోలీసులెప్పుడయినా దొంగతనం జరుగుతుండగా గానీ, మర్డర్ జరుగుతుండగా

గానీ లేక యింకేదయినా క్రైమ్ జరుగుతుండగానీ ఎవరినయినా పట్టుకోవడం గురించి విన్నారా?"

"లేదు."

"మరింక ఇప్పుడు మాత్రం ఎలా పట్టుకుంటారయ్యా, భలే జర్నలిస్టులయ్యా మీరు! మీలాంటి జర్నలిస్టులుండబట్టే దేశం యిలా అఘోరించింది– వస్తా" అంటూ లేచాడతను.

అందరూ కారువరకూ వెళ్ళివాళ్ళకి వీడ్కోలు ఇచ్చారు. అంతే! ఆ తరువాతెప్పుడూ మా కాలనీలో దొంగతనం జరగలేదు. ఇంకమనకి ఏ ప్రాబ్లెమూలేదు. హ్యాపీగా దొంగలకు మామూళ్ళు 'పే' చేస్తూ ప్రశాంతంగా జీవితం గడిపేయవచ్చని అనుకుంటూండగానే మళ్ళీ అవాంతరం వచ్చి పడింది.

మా కాలనీ జనరల్ సెక్రెటరీ రంగారెడ్డి ఇంట్లోనే దొంగలు పడ్డారు. ముందు రంగారెడ్డి దొంగల్ని చూసి షాకయ్యాడు.

"మీరెవరు?" అడిగాడువాళ్ళను.

"కనబట్టంలా! కళ్ళుదొబ్బినాయ్ బే? దొంగలం!"

"దొంగలంటే ఎవరో క్లారిటీ ఇవ్వండి సార్! రాజకీయ నాయకులా, ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్.లా? చీఫ్ మినిష్టర్లా, ఇన్‌కమ్‌టాక్సోళ్ళా, కార్పొరేషన్లోళ్ళా, ఆర్టీఏ వోళ్ళా, పోలీసులా– వీళ్ళల్లో ఏ దొంగలు?"

దొంగల నాయకుడికి కోపం వచ్చింది.

"థూ నీయవ్వ! మేమలాంటి వైట్‌కాలర్ దోపిడీలు చేయంబే! సాలా– ఇజ్జత్ కా సవాల్ హై! మా వంశమేంది, మేమేందనుకుంటివిరా! తరాలకెళ్ళి ప్యూర్ దొంగతనాలు చేసుకుంటూ, గుజరాయిస్తున్నాం బే–"

రంగారెడ్డికి కోపం వచ్చింది. వెంటనే బెల్‌మీట నొక్కాడు. అందరూ పరుగెత్తుకొచ్చారు. వాళ్ళకీ మేటర్ చెప్పాడు రంగారెడ్డి.

"ఇగో! ఇది టూమచ్! మీ దొంగల ముఠా, మా కాలనీ ఓళ్ళు కలసి అగ్రిమెంట్ సైన్ చేసుకున్నాం కదా! దాని ప్రకారం ప్రతినెలా మీకు మామూలు కూడా ఇస్తున్నాం! మళ్ళీ దొంగతనానికి ఎందుకొచ్చినట్లు?"

దొంగల లీడర్ ఇంకా మండిపడ్డాడు.

"ఏంది? మాతో అగ్రిమెంట్ చేసిన్రా? దమాక్ గిట్టా తిరుగుతోందా? సాలా– సిటీల ఈ కాలనీకి ఫస్ట్‌టైమ్ వచ్చినాం బే! జబాన్ సంబాల్ కే బాత్‌కర్!" అన్నాడు దబాయింపుగా.

మాకు మతిపోయినట్లయింది.

వెంటనే అగ్రిమెంట్ సైన్ చేస్తున్నప్పుడు మేము దొంగలతో కలసి దిగిన ఫోటో తీసుకొచ్చి చూశాం.

నిజమే! ఆ దొంగల ముఠావేరు– ఈ దొంగల ముఠావేరు. దొంగల లీడర్ రంగారెడ్డి చేతిలోని ఫోటోలాక్కుని చూశాడు.

"నీయవ్వ! ఈ రామప్పన్ గాంగ్‌తో అగ్రిమెంట్ చేసినారు! ఆళ్ళది తమిళనాడు– మాది మహారాష్ట్రాయె– ఆళ్ళకు మాకు ఏం సంబంధమున్నది?"

మా గుండెల్లో గ్రానైట్ రాళ్ళు పడినయ్.

"అంటే! మీరు మరాఠీ దొంగలా?"

"అవ్!"

"మరి ఈడ– మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికెందుకొచ్చిన్రు?" అడిగాడు యాదగిరి.

"మేమొక్కళ్ళమేంది బే! ఏస్టేటోళ్ళయినా ఈడకే వస్తారు"

"ఏంటిక్కడ ఎట్రాక్షన్?"

"ఈడ పోలీసు డిపార్ట్‌మెంట్ ఇండియాలోనే బెస్ట్ డిపార్ట్‌మెంట్‌రా! మొన్ననే మా దొంగలందరం కలసి ఆలిండియా లెవల్లో ఒపినియన్ పోల్ కండక్ట్ చేశాం. దాని ప్రకారం ఆంధ్రప్రదేశ్ పోలీసులే పూర్తిగా చేతకాని దద్దమ్మలని తేలింది. మరి అందరూ ఈడకు రాకుండా ఇంకేడకు పోతార్రా?"

మేమంతా ఒకరి మొఖాలొకరు చూసుకున్నాం.

"అయితే ఇప్పుడేమంటారు?" అడిగాడు శాయిరామ్.

"మీరు కూడా అగ్రిమెంట్ సైన్ చేస్తారా?"

"నెలకు మామూలెంతిస్తారు?" అడిగాడు దొంగల లీడర్ అనుమానంగా.

"వాళ్ళకిచ్చినట్లే– నెలకు అయిదువేలు! అది కాష్! ఇన్‌కమ్‌టాక్స్ కూడా ఉండదు మీకు–"

"ఏంది? అయిదువేలా? మీకేమయినా దమాకున్నదా? అందులో మేమేం తినాలా– పోలీసులకేం ఇయ్యాల?"

మేము ఉలిక్కిపడ్డాం.

"వాట్? పోలీసులకివ్వాలా?" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రమ్మ.

"అవ్వమ్మా! మేమే ఏరియాలో దొంగతనం చేస్తే ఆ ఏరియా పోలీస్‌స్టేషన్ల అయిదువేలు లంచం ఇవ్వాలె! గిట్ల మీతో అగ్రిమెంట్ జేసినట్లు తెల్సిందంటే పోలీసుల్తో మేము భీ ఇట్లనే అగ్రిమెంట్ చేసుకోవాల్సొస్తది."

మాకేం చేయాలో అర్థం కాలేదు. ఇది కొత్త కాంప్లికేషన్.

"అంటే మరేం చేద్దామంటారు?" అడిగాడు గోపాల్రావ్.

"పోలీసులకు అయిదువేలు- మాకు అయిదువేలు- మొత్తం పదివేలివ్వాలి"

ఉలిక్కిపడ్డాం.

"ఇలా ఒక్కొక్క స్టేట్ దొంగలకు పదివేలు మామూలు ఇస్తాపోతుంటే- మా కాలనీలో అందరం అడుక్కుతిన్నాగానీ మీ బాకీ తీరది" అన్నాడు యాదగిరి.

చాలాసేపు డిస్కషన్స్ తర్వాత చివరకు వాళ్ళూ మేమూ ఒక అండర్‌స్టాండింగ్‌కొచ్చాం!

మరాఠీ దొంగలముఠాకి మా కాలనీ నెలకు ఎనిమిదివేలు కట్టాలి. అందులో నాలుగువేలు వాళ్ళు పోలీసులకు కడతారు.

అప్పటికప్పుడే అగ్రిమెంట్ సైన్ చేయటం జరిగిపోయింది.

వాళ్ళందరికీ, చాయ్, సిగరెట్లు ఇచ్చి- అడ్వాన్స్‌గా ఒకనెల మొత్తం ఇచ్చి సాగనంపేసరికి తెల్లారిపోయింది.

ఆ రోజునుంచీ అందరం హాపీగా ఉండవచ్చనుకున్నాం గానీ- నిజానికి ఆ రోజునుంచీ ఎవరికీ కంటినిండా నిద్రలేదు.

అందుక్కారణం- ఇంకే రాష్ట్రం నుంచి కొత్త దొంగల ముఠా వస్తుందో అన్న భయం-*

